# పారిజాతం

(కథానిక)

మొన్న ఒకసారి నేను కోయిలకూత విన్నాను. ఇందులో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. సజీవమైన కోయిల చుట్టుపక్కల ఎక్కడో వాస్తవంగానే కూసింది.

అప్పుడు మధ్యాహ్నం ఒంటిగంట దాటుతుంది. తీక్ష్ణమైన ఎండ. ఆఫీసులో మేడమీద కూర్చుని ఎదురుగా రోడ్డువేపు చూస్తున్నాను. మహానగరపు మహామహా రోడ్డేమో, సరభస గమనంతో మనుషులూ, ఇంద్రధనస్సు రంగుల మోటార్లూ వీటితో కోలాహలంగా ఉంది.

నిప్పులు వర్షిస్తున్నట్టు ఎండ. అప్పుడే అకస్మాత్తుగా కోయిలకూసింది; స్పష్టంగా, ధైర్యంగా కంఠం ఎత్తి కూసింది.

మొదట అదో కొత్తరకపు మోటారు హారన్ ఏమో అనుకున్నాను. కాని మళ్ళీ కూసింది. నేను అప్రమత్తుడనై విని, అది తప్పకుండా ఏదో బతికివున్న కోయిల బాపతు కంఠమే అనుకున్నాను.

"కోయిల కూస్తోంది విన్నావా?" అన్నాను పక్కనున్న మిత్రుడితో.

"నీ మొహం. ఏశబ్దం విన్నావో! ఇక్కడ కోయిల కుయ్యడం ఏమిటి? కుయ్యడానికీవీల్లేదు" అన్నాడు మిత్రుడు.

ఆలోచించాను. ఎదురుగా బ్రహ్మాండమైన మేడలు. విశాలమైన రోడ్డు. యంత్రచాలితుల వలె పనిచేసే నాలాంటి నాగరికులు. ఇటువంటి పరిసరాల్లో కోయిలకూత చాలా అపశ్రుతిగా వినబడింది. ఎంతధైర్యం దానికి! ఎంత నిర్భయంగా కూస్తోంది!—అనుకున్నాను.

వివిధ వాసనలూ, వివిధ శబ్దాలూ మన మనస్సులమీద వింతగా పని చేస్తాయని శాస్త్రజ్ఞులు అంటారు. ఉల్లాసం, విషాదం, ఏదో అశాంతి, గడిచిపోయిన జీవితం స్ఫురణకి రావడం యీ విధమైన భావాలకి శబ్దాలూ, వాసనలూ ఉద్దీపన కలిగిస్తాయట.

కోయిలకూత నామీద అలాగే పనిచేస్తుంది. ఎక్కడ కోయిలకూత విన్నా, గడిచిపోయిన ఒక అనుభూతి తాలూకు వివిధ అనుభవాలు స్ఫురణవచ్చి ఏదోవేదన కలిగిస్తుంది. కాని, నాగరికమైన మహానగరంలో నాగరికంగా జీవిస్తున్నాం కనక, యిటువంటి ఆలోచనన్ని నెమరువేసుకోడానికి నాకుగాని, ఏదో కొమ్మమీద కూర్చుని కుయ్యడానికి కోకిలకిగాని, అట్టే అవకాశాలుండవ్.

సంవత్సరాలక్రితం. అప్పుడు రైలువాళ్లు పది రూపాయిల టిక్కెట్లని ఒకరకం టిక్కెట్లు అమ్మేవారు. అది కనక ఒక్కటికొంటే పక్షం రోజుల పాటు రైలు బళ్ళల్లోనే కాపురం ఉండొచ్చు. ఏ రైలు ఎక్కి ఎన్నిసార్లు ఎక్కడికైనా వెళ్ళేహక్కు ఆ టిక్కెట్టు ప్రసాదించేది.

నేనూ రాజారావూ, అలాంటి టిక్కెట్లు కొనుక్కుని ఆ ఎండాకాలంలో బయలుదేరాం.

ఒకనాడు సాయంత్రం నాలుగుగంటలు. ఆ రైలు ఎక్కడనుంచి ఎక్కడికి వెళుతోందో నాకు తెలీదుగాని, ఆ సమయానికి కొవ్వూరులో ఆగింది. స్టేషన్‌చుట్టూరా చెట్లు దట్టంగా ఉన్నాయి. రైలు ఆగగానే మమ్మల్ని ఆకర్షించింది ప్రయాణికుల గోలని మించిన గోలచేస్తూ చెట్లమీద అరుస్తున్న కోయిలల గుంపు.

మేం ఆ క్షణాన రెండో తరగతి పెట్టెలో ఉన్నాం. మూడో తరగతి పెట్టెలన్నీ క్రిక్కిరిసి ఉన్నాయి. టిక్కెట్టు ప్రకారం చూస్తే, మేం వాటిలో ఉండవలసిన వాళ్ళమే. కాని రాజారావు ధైర్యంమీద రెండో తరగతిలో కూర్చున్నాం. ఆ స్టేషన్‌లో ఎంతోసేపు బండి ఆగదు. ప్లాట్‌ఫారంమీద విపరీతమైన జనం. ఆ జనాన్ని చీల్చుకుంటూ ఒకభాగం అటూయిటూ

గోరాశాస్త్రి

ఆడావిడిగా పరిగెడుతున్నారు. వాళ్ళకి ఎదురుగా మాపెట్టె ఉంది. అందులోకి కంగారుగా మూడు వాసెన కట్టిన బింజెల్ని తోశారు.

"ఏమండోయ్, ఇది సెకెండు క్లాసు" అన్నాడు మాలో ఒకడు.

"కాబోసు నాయనా! రైలుపెట్టె అంటూ అయాక, ఏదో ఒకక్లాసు కాకుండాపోతుందా?" అంటూ ఒకాయన లోపలికివచ్చి బింజెల్ని వరసగా పేర్చాడు. "అమ్మాయీ! నువ్వూ రామ్మా! మన ఇద్దరం ఇందులో కూర్చుందాం. తక్కిన వాళ్లు అక్కడక్కడ సర్దుకుంటారులే" అని అరిచాడు.

ఆమాట వింటివాళ్ళు అందుకుని పదిహేనేళ్ళ అమ్మాయిని బండిలోకి నెట్టారు. బండి కదిలిపోయింది. ప్లాట్‌ఫారంమీద సన్నాయి మేళం శ్రావ్యంగావినబడుతూ దూరంగా కరిగిపోయింది.

ఇంతసేపూ నిర్లిప్తతగా చూస్తున్న రాజారావు ఇక విజృంభించాడు. "బాబుగారూ, పెళ్ళి నుంచివస్తున్నారా?" అన్నాడు, వినయం ఉట్టిపడుతూ. లేచి అందర్నీ కాస్తసర్దుకోమని వచ్చిన వాళ్ళిద్దరికీ చోటుచేశాడు.

బాబుగారు విశ్రాంతిగా కూర్చుని, చుట్ట వెలిగించారు. "ఏమిటి అబ్బాయీ. అడుగుతున్నావూ? పెళ్లినుంచా అంటావా? అవున్నాయనా, అక్కణ్ణించే మరీ. అమ్మాయికి పెళ్ళి చేశాను. మణుగుడుపులకి తీసికెళుతున్నాం, బెజవాడ" అన్నాడు.

అమ్మాయి పొదుపుగా కూర్చుంది. సన్నని పొందూరు మధుపర్కాలు కట్టుకుంది. కళ్యాణ తిలకం నుదిటిమీద మెరుస్తోంది. చామంచాయ శరీరం. తీరైన విగ్రహం. అందులో పెళ్ళికూతురు అలంకరణ ధరించిందేమో, ఏదో శోభతో, పవిత్రతతో ప్రకాశిస్తోంది. అనవసర లజ్జా, భయం, ఆమె మొహంలో కనబడలేదు. మెరుస్తున్న కళ్ళతో అందర్నీ చూస్తూంది.

"ఆ వాసెన బింజెల్లోవి ఏమిటండీ?" అన్నాడు రాజారావు.

"అవా, ఏముందీ! మిఠాయి." అన్నాడు బాబుగారు. "తింటారా! ఇదిగో అమ్మాయ్, రెండు ఉండలు బయటికి తియ్యి" అన్నాడు.

రాజారావు ఉద్దండుడు. "అమ్మమ్మ, ఎంత మాట, అక్కర్లేదుబాబూ ఉంచండి. నాకసలు మిఠాయి సయించదు. ఉంచండి. విడిదిలో అవసరం ఉంటుంది. ఉంచండి" అన్నాడు.

ముసలాయన ఊరుకోలేదు. అమ్మాయిచేత రెండు ఉండలు తీయించి రాజారావు చేతిలో పెడుతూ, "తినవయ్యా ఫరవాలేదూ, మా అమ్మాయి పెళ్ళిమిఠాయి ప్రాప్తం ఉంది నీకు; తప్పుతుందా!" అన్నాడు.

"చిత్తం! ఎంతమాట!" అంటూ రాజారావు వాటిని అందుకున్నాడు.

క్రమంగా రెయిలు ఊగుడికి ముసలాయనకి కునుకు పట్టింది. నోటిలో చుట్ట జారిపోయింది. రాజారావు అతనికి పైబల్లమీద పక్క ఏర్పాటు చేశాడు. రెండు స్టేషన్లుదాటాక ముసలాయన గుర్రుతీసి నిద్రపోయాడు.

ఆ తరువాత రాజారావుకి ఓ చురుకైన ఆలోచన తట్టింది. నాతో అన్నాడు: "చూడూ, పెళ్ళి మిఠాయి ప్రాప్తి మనకిద్దరికేనా, బండిలో అందరికీ కలగాలి" అని.

ఆ మాట విని పెళ్ళికూతురు తనలో తను నవ్వుకుంది. రాజారావు నెమ్మదిగా బింజెల్ని సమీపించాడు. నాలుగు మిఠాయి ఉండలు తీశాడు. ఉండలు చాలా ఘనంగా ఉన్నాయి: కుంకుంపువ్వూ అదీ వేసి, దబ్బపండు ప్రమాణంలో కట్టారు. అవి చుట్టుపక్కల వాళ్ళకి పంచాడు.

అనంతరం వాడు శిబిచక్రవర్తి అంతటివాడు అయాడు; స్టేషన్‌లో బండిఆగి ఎవరయినా లోపలికి రావడం భయం-చిరునవ్వుతో స్వాగతం యిచ్చి మిఠాయి ఉండ చేతిలో పెట్టేవాడు. కొత్తవాళ్లు బండి అంతా పరకాయించి చూసి, పెళ్ళికూతుర్ని గుర్తించి, "పెళ్ళా అండి!" అనేవారు రాజారావుతో.

"అవునండి. మా చెల్లెలుకి పెళ్ళిచేశాం. మణుగుడుపులకి తీసికెళుతున్నాం" అని వాళ్ళకి సమాధానం చెప్పేవాడు.

పెళ్లికూతురు ఇదంతా గమనిస్తూనే ఉంది. ఏమీ అనలేదు సరికదా, తనకేం సంబంధం లేనట్టూ, ఏదో వినోదంచూస్తూ ఆనందిస్తున్నట్టూ కూర్చుంది. రెయిలు బెజవాడ చేరేటప్పటికి రాత్రి తొమ్మిది దాటింది. అంతేవరకూ ముసలాయన నిద్రపోతూనే ఉన్నాడు. పెళ్లిలో ఎన్ని నిద్ర

లేనిరాత్రులు గడిపాడో పాపం. బెజవాడలో తక్కిన పెళ్లివారు వచ్చారు. ఈ జనసమ్మర్దంలో నేనూ, రాజారావూ, పెట్టె అవతలపక్కనించి దిగి ఇంకోపెట్టెలోంచి మళ్ళీ ప్లాట్‌ఫారం మీదికి వచ్చాం.

"ఇప్పుడు చూడు తమాషా!" అన్నాడు రాజారావు.

ముసలాయన చిందులు తొక్కుతున్నాడు. బిందెలు బోషినోళ్ళతో ప్లాటుఫారంమీద ఉన్నాయి. పెళ్ళికూతురు పక్కనే నుంచుంది.

"మూడు బిందెల మిఠాయి! చూస్తూ ఊరు కున్నావా అమ్మాయ్?" అన్నాడాయన.

పక్కనుండి మేం వేడుక పరిశీలిస్తున్నాం.

"ఊరుకోలేదు నాన్నా!" అంది అమ్మాయి.

"ఏం చేశావు ఊరుకోక" అన్నాడు తండ్రి.

"అందర్నీ తీసుకోమన్నాను. ఎవరైనా తినడానికేకదా నాన్నా!" అంది ఆమె అప్యాయంగా.

దానితో ముసలాయన కరిగిపోయాడు; పితృ వాత్సల్యం ఉట్టిపడుతూ "పోనీలే తల్లీ! మళ్ళీ చేయిద్దాం. నీ పెళ్లి మిఠాయి నువ్వు పంచేశావ్! అంతేనా! మా లక్ష్మితల్లి చేతికి ఎముకలేదు" అన్నాడు.

తరువాత జనాన్ని చీల్చుకుంటూ మేం ముందుకి నడిచాం. కాని, మా రాజారావు మొహంలో మాత్రం విజయగర్వరేఖ అదృశ్యమైంది. దారిలో అన్నాను, "ఏం రాజారావ్, ఏమంటావ్, పెళ్లి కూతురు నిన్ను సిగ్గుపడేటట్లు చేసిందా?" అన్నాను.

"నిజమేనోయ్. ఆ పిల్లది క్షీరసాగరంలాంటి మనస్సు. కాని, ముమ్ముందు జీవితంలో చాలా కష్టపడుతుంది" అన్నాడు.

"కష్టపడొచ్చు. కాని ఖేదపడదు" అన్నాను నేను.

ఈ ఉదంతం జరిగిన చాలా సంవత్సరాలకి.

రాజారావూ నేను కాలేజీవిడిచి ప్రపంచంలో పడ్డాం. ప్రపంచయుద్ధం ముమ్మరంగా జరిగి, నాగవల్లికి సమీపిస్తున్న దినాలవి. సేవకావృత్తిలో అనేక పరిభ్రమణాలుచేస్తూ ఉత్కళ దేశంలో రాధామోహనపురం వెళ్ళవలసి వచ్చింది. ఒక సుప్రభాతాన్న రెయిలు దిగి పరుపుచుట్టతో గ్రామంలో ప్రవేశించాను.

రాధామోహనపురం విచిత్రమైన ప్రదేశం. అది ఊరు కాదు. రెయిల్వేకూడలి. అంచేత అక్కడ రెయిల్వే కాలనీ, దాన్ని అంటిపెట్టుకుని కొన్ని దుకాణాలూ తప్ప, గ్రామం ఏదీలేదు.

రెయిలుస్టేషను ఎదురుగాఉన్న కాఫీశాలలోకి ప్రవేశించాను. పక్కనే నా సమవయస్కుడు ఒకాయన వచ్చి కూర్చున్నాడు.

రెండునిముషాలయాక ఆయనే పలకరించాడు: "కొత్తగా వచ్చారా?" అని. చెప్పాను, ఫలానా ఆఫీసుకి బదిలీ అయివచ్చానని చెప్పాను.

"నాపేరు కృష్ణమూర్తి. నేనూ అక్కడే పని చేస్తున్నాను. అంటే మనం తోటిగుమస్తాలమన్న మాట. మీరు ఎక్కడ ఉంటారు?"అన్నాడు.

"ఇంకా ఏం తెలీదు. ఊరికే పనిలో ప్రవేశించి, అధికారిని సెలవు అడిగి వెళిపోదామనుకుంటున్నాను. ఇల్లు ఇస్తే ఉంటాను" అన్నాను.

"మీకు యిల్లు ప్రస్తుతం ఇవ్వరు. ఏవీ ఖాళీలు లేవు. సెలవుకూడా ఇవ్వరు. పని విస్తారంగా ఉండడంవల్లనే మిమ్మల్ని ఇక్కడికి రప్పించారు" అన్నాడాయన.

ఆ మాటలతో నా గుండెల్లో రాయిపడింది. ఇల్లులేదు. సెలవు ఇవ్వరు.

అయితే ఎలాగ అక్కడ ఉండడం? ఎవరు చెపుతారు, ఆ ప్రశ్నకి సమాధానం?

"మా యింటికిరండి, తరవాత ఆలోచిద్దాం," అన్నాడాయన. ఆయన ఎవరో నాకు తెలీదు. నేనెవరో ఆయనకి తెలీదు. కాని ఆయనకి ఒక్కటే తెలిసినట్లుఉంది. తోడిమానవుడొకడు నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. అంతే. కృతజ్ఞతతో ఆయన్ని అనుసరించాను.

అక్కడి రెయిల్వే కాలనీ చాలా ఆహ్లాదంగా ఉంటుంది. తీర్చిదిద్దిన బాటలు. బాటలకి రెండు ప్రక్కలా శిరీష వృక్షాలు. పరిశుభ్రమయిన చిన్న చిన్న యిళ్ళు. అందరూ గ్రాసవాసోదైన్యం ప్రేరేపించగా అక్కడికి చేరినవాళ్ళు కాబట్టి అందర్నీ బంధించే ఒకేఒక ఆధ్యాత్మిక బాంధవ్యం గోచరిస్తుంది.

ఇల్లు సమీపించాం. మూడేళ్ళ పసిపాప నవ్వుతూ ఆహ్వానించింది. యింటిముందు పారిజాతం చెట్టుకింద నించొని, రాలినపువ్వులు ఏరుతోంది.

కృష్ణమూర్తిగారు లోపలికి ప్రవేశిస్తూ, "లక్ష్మీ! స్నేహితులొచ్చారు. కాస్త కాఫీ పెట్టి ఇయ్యి" అన్నాడు.

వసారాలో కూర్చుని మేం ఏవో సేవాధర్మ విషయాలు మాటాడుకున్నాం. ఇంతలో గృహిణి కాఫీ తీసుకువచ్చింది.

ఆమెను చూడగానే నాకు అమితమైన ఆశ్చర్యం కలిగింది. వెంటనే విపరీతమైన భయం. వెన్నెముకలో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్టయింది.

"కాఫీ తీసుకోండి" అన్నాడాయన.

నాకేమీ వినబడ్డంలేదు. మెదడులో సముద్రపు హోరు. ఎందుకలా ఆందోళనపడ్డానో నాకే తెలియదు. అలాగే పరధ్యానంగా స్నానం మొదలయినవి ముగించి, ఇద్దరం ఆఫీసుకు వెళ్ళిపోయాం.

సాయంత్రం ఆఫీసునుంచి తిన్నగా రెయిలు స్టేషన్‌కి వెళ్ళాను. రాత్రి స్టేషనులోనే గడపడానికి నిశ్చయించుకున్నాను.

ఏదో దొరికిన ఫలహారంచేసి, వెయిటింగ్ రూములో కూర్చున్నాను. బయట చిన్నచినుకులతో వర్షం ప్రారంభించి, క్షోణీపాతంగా పడుతోంది. ఉత్కళదేశపు వర్షమూ, ఎండా, చాలా తీవ్రంగా ఉంటాయి, అధికారి ఆగ్రహంవలె.

ఆ వర్షంలో నడుచుకుంటూ, హఠాత్తుగా ప్రత్యక్షమయాడు, కృష్ణమూర్తిగారు. గొడుగూ, లాంతరూ, కిందపెట్టి, "ఏమండీ, సాయంత్రం మీకోసం వెతిగాను, కనబడలేదు. తిన్నగా ఇంటికి వస్తారేమో అనుకున్నాను. ఇప్పటిదాకా రాకపోతే బయలుదేరి వెతుక్కుంటూ వచ్చాను. పదండి. భోజనంచేశాక మాటాడుకుందాం," అన్నాడు.

సూర్యోదయ శోభ చూసి ఎవరైనా "ఒహోహో; ఎంత గంభీరంగా ఉన్నావు?" అని కృతజ్ఞత మాటల్లో యిమడ్చ గలుగుతారా?

అలాగే నేనూ నిశ్చేష్టితుణ్ణయిపోయాను, అతని ప్రవర్తనచూసి. మారుమాట లేకుండా, అపరాధివలె అతడిని అనుసరించాను, వర్షంలో తడుస్తూ, అతని దయారసంలో తేలుతూ.

ఆమె చిరునవ్వుతో ఆహ్వానించింది. "మీరు అంత మొహమాట పడనక్కరలేదు. ఈ అరణ్యంలో, మనలాంటి బక్కవాళ్ళు ఒకళ్లకి ఒకరు అసరాగా ఉండకపోతే, అసలు జీవించనే లేరు," అంది.

భోజనాలయాక అందరం హాలులో కూర్చున్నాం. అప్పుడు నేనే ఆ ప్రస్తావన తీసుకువచ్చాను. "ఏమండీ, నేను జ్ఞాపకం ఉన్నానా? మీ పెళ్ళిలో మణుగుడుపులకి మీరు వెళుతుంటే రెయిల్లో జరిగిన ఒకసంఘటన జ్ఞాపకంఉందా?"

ఆమె నవ్వింది. వెండిమువ్వల నవ్వు. ఫాల్గుణ మల్లెల నవ్వు.

"అవును, జ్ఞాపకం ఉంది. మూడు బిందెల మిఠాయి మీరూ, మీస్నేహితుడూకలిసి దానం చేశారు మిమ్మల్ని చూడగానే జ్ఞాపకం వచ్చింది. సాయంత్రం ఆయనతో చెప్పానుకూడా." అంది.

"అందుకనే సాయంత్రం మీ ఇంటికి రావడం భయం వేసింది. మీరు ఏమనుకుంటారో అని రాలేదు." అన్నాను.

"ఇందులో సంతోషించడానికేగాని, బాధ పడవలసిన విషయం ఏముందీ?" అన్నాడు, కృష్ణమూర్తిగారు. అంటూ, "ఇవ్వడంలో ఉండేహాయి అందరికీ తెలీదు. దానికికూడా ఎంతో సంస్కారం ఉండాలి. జీవితంలో ఎంతో మథనపడ్డవాళ్లుగాని, గాయపడ్డ వాళ్లుగాని, యివ్వడంలోని హాయి తెలుసుకోలేరు" అంటూ అర్థయుక్తంగా భార్య వేపుచూశాడు.

"నిజం" అందామె.

"వాగర్థా వివ సంపృక్తౌ" అన్న మహాకవి శ్లోకానికి యీ దంపతులిద్దరూ ఒక నిరూపణ అనుకున్నాను. అతడు వాక్కు; ఆమె అర్థం.

మర్నాడు ఉదయం నేను నిద్రలేచేటప్పటికి ఆమె పారిజాతం చెట్టుకింద పువ్వులేరుతోంది.

"పూజకా?" అన్నాను.

"కాదండీ. ఊరికేనే. పారిజాతాలంటే నాకు చాలా ఇష్టం. చూశారా, ఎర్రటి తొడిమ. శాంతమైన పైమూర్తి. అంటే, హృదయం మరుగుతున్నా, ఎంత నిబ్బరం, ఎంత శాంతం, పైకి;" అంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. "మీరు అచ్చంగా కవిత్వం మాటాడు తున్నారు. యీ భావాన్నే ఒక పేరు పొందిన ఆంధ్రకవి ఇదివరలో ఎక్కడో రాశారు మీరు చదివారా?" అన్నాను.

"లేదండీ. నేను అప్పటే చదువుతున్న దాన్ని

కాదు; మీకు తెలియదేమో, నేను చదువురాని మొద్దుని, ఆ మాటకొస్తే." అందామె, నిష్పృహతో.

తర్వాత ఆ వూరిలో నేను రెండు సంవత్సరాలు గడిపాను. నా మరణానంతరం భగవంతుడు కనుక "ఇన్ని సంవత్సరాల జీవితం గడిపావు అందులో నిజంగా సార్థకమైన భాగం ఎంత?" అని అడిగితే, యీ రెండు సంవత్సరాలే నేను ఉదహరించగలిగినవి, అనుకుంటాను. ఆదంపతుల సహాచర్యంలో గడిపిన రెండుసంవత్సరాలూ నేను అంత అమూల్యంగా భావించుకుంటాను.

"ఏముంది, వాళ్లలో గొప్ప?" అని ప్రశ్నిస్తే, చెప్పడానికి సమాధానం లేదు. బాహ్యదృష్టిలో చూస్తే, ఏమీలేదు కూడా. చాలా సామాన్యమైన కుటుంబం.

ఆమెతండ్రికి యిద్దరే కూతుళ్లు. ఈమె రెండవది. ఈమె వివాహం అయిన మరుచటి సంవత్సరమే తండ్రి మరణించాడు. తగుపాటి ఆస్తి ఏదో ఉంటే అది యీమె అక్కయ్యా, బావా తీసుకున్నారు. చివరికి అత్తవారు యీమెకిచ్చిన నగలు కూడా తీసుకున్నారు.

అటువంటి స్థితిలో యీమె అత్తవారింట అడుగు పెట్టింది, నిర్భయంగా.

"ఆస్తి అంతా అక్కయ్యకి ఇచ్చేసి నోరు మూసుకు ఊరుకుంటావా?" అని ఉరిమాడు, మామగారు.

"అక్కయ్య అడిగింది, ఇచ్చేశాను." అని యీమె సమాధానం.

"అలా మేం ఎవరమైనా అడిగితే ఇచ్చేస్తావా?"

"సంతోషంతో" అని సమాధానం చెప్పింది.

అత్త, మామలకి యీ ప్రవర్తన ఏమీ బోధపడలేదు. యీ పిల్లకి డబ్బంటే ఇంత నిర్లక్ష్యం ఏమిటి?-అనుకున్నారు. అనేకవిధాల ఆమెని కష్టపెట్టారు. కష్టపడిందేకాని, ఖేదపడలేదు. భర్తకి కూడా ఆశ్చర్యం కలిగింది.

"ఇంటి యింటెటు చాకిరీ నీచేత చేయిస్తున్నారు; ఊరుకుంటావేం?" అనేవాడు భర్త, జాలిగా. "ఇందులో తిరగబడ్డానికి కారణం ఏముంది? వాళ్ళకివ్వడానికి నాదగ్గిర యింకేముంది కనక! ఈ మూలకంగా కొంచెం విశ్రాంతేనా ఇవ్వగలుగుతున్నాను" అనేది.

చివరికి కష్టపడి భర్త ఓ చిన్న ఉద్యోగం సంపాదించాడు. ఇద్దరూ వెళ్ళారు. మామగారు ఏవిధమైన సహాయమూ చెయ్యలేదు. పైపెచ్చు వాళ్ళవెంట ఇద్దరు ఆఖరు కొడుకుల్నీ పంపుతూ "వీళ్ళని జాగ్రత్తగా కాపాడు లక్ష్మీ" అన్నాడు.

"తప్పకుండా మావయ్యా!" అందామె సంతోషంతో మామగారు తనకేదో ఉపకారం చేసినట్లు. అప్పుడప్పుడు ఆయనకూడా వాళ్ళ యింటికి వెళ్లి ఉండేవాడు. దూర్వాసుడు పాండవుల్ని పరీక్షించినట్లు వాళ్లని పరీక్షించాడు. అర్థరాత్రి అతిథుల్ని తీసికెళ్ళేవాడు. అందరికీ సంతోషంగా వండిపెట్టేదామె. డబ్బు అడిగేవాడు. ఉన్నదంతా ఇచ్చేసేది.

మామగారు మరింత గాయపడ్డాడు. ఆమె తిరగబడినా అతడు సంతోషించి ఉండును. ఏడ్చి సహాయంకోసం ప్రార్థించినా అతడికి అర్థమై ఉండును. ఆమె రెండూ చెయ్యలేదు.

"లక్ష్మికి ఎంత రాజసం! ఎంత స్వాభిమానం" అనేవాడు.

ఆమె అక్కయ్యా బావా వచ్చేవారు. "చెల్లీ యీ రెండుచీరలూ నేను తీసుకోనా? అంచులు ఎంతో బాగున్నాయి" అనేది అక్కయ్య.

"తీసుకో" అనేది యీమె నిశ్చింతగా.

"వదినా యీ సంవత్సరం అన్నయ్యవంతు శిస్తు నేను తీసుకోనా? కాస్త అవసరం ఉంది" అనేవాడు రెండోమరిది.

"తీసుకోనివ్వండి" అనేది ఆమె భర్తతో.

కాలనీలో స్త్రీలంతా ఏసహాయం కావలసినా యీమెనే అడిగేవారు. కాని యీమె వాళ్ళని ఏమీ అడిగేది కాదు.

"లక్ష్మిగారికి ఎంత రాజసం" అనుకునేవారు వాళ్లుకూడా.

ఇవన్నీ రెండుసంవత్సరాల సన్నిహిత సహచర్యంవల్ల నేను క్రమంగా తెలుసుకున్నాను. యిల్లు దొరక్క వాళ్ళ ఆతిథ్యంలో ఆరుమాసాలున్నాను కుటుంబంతో సహా. అందులో జ్వరాలు. అన్నిటిలోనూ—సుఖంలో, దుఃఖంలో దంపతులిద్దరూ ఆదుకున్నారు ప్రియబాంధవుల వలె.

ఆర్తుడూ, పాంథుడూ, అభ్యాగతీ, ఎవరో ఒకరు లేని రోజే ఉండేది కాదు ఆయింట్లో. కాని పరిమితమైన స్వల్ప ఆదాయంలో ఎలా ఇవన్నీ చెయ్యగలుగుతున్నారో నాకు బోధపడేది కాదు.

"మీరు ఇంత గొడవగల సంసారం నడుపుతున్నారు. న్యాయంగా మీకు ఒచ్చేదయినా మీవాళ్ళని అడగకూడదా? యీ కాటకపు దినాల్లో ఉపకరిస్తుంది కదా!" అనేవాణ్ణి.

"ఏది జీవితంలో అవ్యాజమైన ప్రేమతో మనకి రాదో, దాన్ని సంతోషంగా వదులుకోవడం మంచిది కాదా?" అనేదామె.

తరవాత నేనావూరు విడిచి మహా నగరంలో అడుగుపెట్టాను. కొత్తలో నాకంతా ఆగమ్యగోచరంగా ఉండేది. భీముడు బకాసురుణ్ణిచూసి "వీని బాస వేరు" అన్నాట్ట. అలాగ ఎవర్ని చూసినా, నాకు ఆ మాటే అనబుద్ధి వేసేది.

"సాంఘిక వ్యవస్థ బాగులేదు, మానవానీకానికి అందరికీ ఉపకరించే సాంఘిక ధర్మం తలలెత్తాలి. నిద్రాణమైన మనజాతి మేల్కోవాలి. పాతమార్గాల ఆలోచనలూ, ప్రవర్తనలూ, ఇక పనికిరావు." యీ మాటలే మహానగరంలో ప్రతినోటా వింటూంటాను. అవి చెప్పేవారి నిశితమైన మేధస్సులు నన్ను చకితుణ్ణిచేస్తాయి ఇప్పటికీ. హృదయం ఎవరికీ ప్రధానం కాదు. మేధస్సు. వస్త్రికాళం చేసిన వజ్రచూర్ణంలాంటి మేధస్సు. అదే ప్రధానం. వీళ్లు పాతమార్గాల ఆలోచించరు. అంతా భవితవ్యం గురించే ఆలోచిస్తూంటారు. భూగోళంలో ప్రతి అంగుళం స్థలంలోనూ ఏక్షణం ఏ జరిగిందో వీళ్ళు తెలుసుకుంటూంటారు. తెలుసుకుని? తెలుసుకుని ఆలోచిస్తారు, లోకం మరమ్మత్తు ఎలాగా, అని. అందుకనే వీళ్ళయింటికి పొరపాటునైనా వెళితే, మంచినీళ్ళు కూడా ఇవ్వరు. మహానగరం కాబట్టి పొరుగువాడికి అసలే ఎందులోనూ తోడుపడరు.

అది సరే. తరవాత లక్ష్మిగారి సంగతి ఏమైంది? ఇటీవల ఆమె భర్త మరణించాడు, రైలుకింద కాలు జారిపడి. ఆమె ఏమయిందో తెలీదు. ఒకసారి వెళ్ళి చూసివద్దామని ఉంది. కాని, మహానగరంలో ముఖ్యమైన పనిలో ఉన్నాను కనుక వెళ్ళడానికి వీల్లేక పోయింది.

ఒకటి రెండుసార్లు భార్యతో అన్నాను, "లక్ష్మిగారు పాపం, ఏం కష్టపడుతోందో! నెలనెలా మనకు తోచింది తృణమో పణమో పంపిద్దామా?" అని.

"ఈ కరువుకాలంలో మనకే తిండికీ, బట్టకీ చాలడంలేదు. ఏం పంపగలం? అన్నిటికీ భగవంతుడే ఉన్నాడు" అందామె.

ఒక పెద్దమనిషితో యీ ప్రస్తావన ఎత్తాను ఒకసారి. "మన సాంఘిక వ్యవస్థ మారాలండీ. అంతవరకూ పరిస్థితులు మారవు" అన్నాడు ఆయన.

కాని, మారేంతవరకూ ఏం చెయ్యడం? నాకు తెలియలేదు.

మొన్న నేనాభార్య పుట్టినరోజుకి లక్ష్మిదగ్గిర నుండి ఒక పార్శెలూ, ఒక ఉత్తరమూ వచ్చాయి. ఉత్తరంలో ఇలాఉంది: "పుట్టినరోజుకి అక్కయ్యనుండి యథాశక్తి కానుక."

"తనకి లేకపోయినా, నాకు కానుక పంపుతోంది. ఈమెకి ఎంత రాజసం?" అంది నాభార్య.

ఇప్పటికీ నాకు ఎప్పుడు కోయిలకూత విన్నా లక్ష్మి జ్ఞాపకంవస్తుంది. ఎక్కడ పారిజాతం చూసినా లక్ష్మి జ్ఞాపకంవస్తుంది.

---

జంబూద్వీపంలో ఒక రాజ్యాన్నేలేరాజు అకస్మాత్తుగా తన స్వారీ గుర్రాన్ని ప్రధానమంత్రిగా నియమించి, మనిషినెక్కి స్వారీ చెయ్యడం మొదలెట్టాడు. ఈ పద్ధతి ఫలించి దేశం సుభిక్షం అయి ప్రజలు సుఖపడసాగారు. ఇది గమనించిన ఒక వృద్ధ రాజకీయవేత్త రాజుని సమీపించి, "మహారాజా! తమరు ఎందుగడ్డి మోపుగా మారిపోయి ఒక ఎద్దుని సింహాసనమెక్కిస్తే యింకా మంచిదేమో!" అని సూచించాడు.

రాజు చిరునవ్వునవ్వి "ఒక మంచిసూత్రాన్ని మీరు సాగదీస్తున్నారు. నాకు విప్లవంలో నమ్మకంలేదు. నేను ప్రజాస్వామిక సామ్యవాదిని!" అన్నాడు.